నవతెలంగాణ
ఆదిలాబాద్
1
శనివారం | నవంబర్ 30, 2024 | www.navatelangana.com

రైతును రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-సారంగాపూర్

రైతును రాజు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పిఏసిఎస్ ఛైర్మెన్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కౌట్ల(బి), ఆలూరు సొసైటిల్లో ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా రైతు పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, రైతు పండించిన సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్, వ్యవసాయ వస్తువుల కొనుగోలుకు జీఎస్‌టి తొలగింపు, వ్యవసాయానికి కావాల్సిన ఎరువులు, విత్తనాలు సంఘాల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, సొసైటి సిఈఓలు సలీం, మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.



చిరుత పులి దాడిలో మూడు గొర్రెలు, మేక మృత్యువాత

నవతెలంగాణ-బోథ్

మండలంలోని బాబేర తండా గ్రామానికి చెందిన రైతు అవునూరి రమేష్‌కు చెందిన మూడు గొర్రెలు, మేక పిల్లపై చిరుత పులి దాడి చేసి చంపేసింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం తన ఇంటి సమీపంలో మేకల మందకు స్థావరం ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో ఒకేసారి చిరుత పులి దాడి చేసింది. అందులోంచి చిన్నమేక పిల్లను ఎత్తుకెళ్లి పోయింది. దాదాపు వాటి విలువ రూ.25వేలు ఉంటుంది. చిరుత పులి దాడిలో నష్టపోయిన రైతుకు ఎఫ్ఆర్ఓ ప్రణయ్ స్పందించి రూ.4500 తక్షణ సాయం చేశారు. నష్టపోయిన రైతు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు.



చట్టాల రూపకల్పనలో సీపీఐ(ఎం) ముఖ్య భూమిక

- పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలి
- కర్తవ్యాలను చిత్తశుద్ధితో అమలు చేయాలి
- మాజీ ఎంపీ మిడియం బాబూరావు
- ముగిసిన సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

ప్రజా సమస్యల పరిష్కారంలో సీపీఐ(ఎం) అనేక పోరాటాలు చేసిందని, యూపీఏ-1 ప్రభుత్వంలో పలు చట్టాలకు రూపకల్పన చేయడంలో పార్టీ ముఖ్య భూమిక పోషించిందని మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. 2005లో వచ్చిన ఉపాధి హామీ, అటవీహక్కు, సమాచారహక్కు చట్టాలను తీసుకురావడంలో కృషి చేసిందని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు జరిగిన సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు శుక్రవారం ముగిశాయి. ఉదయం పార్టీ జెండాను పార్టీ సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి ఆవిష్కరించారు. అనంతరం అమరువీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ పార్టీలకు లేని విధంగా సీపీఐ(ఎం)కు స్పష్టమైన విధానం ఉందని వివరించారు. పార్టీ కర్తవ్యాలను చిత్తశుద్ధితో పాటించి అమలు చేయాలని సూచించారు. పార్టీ పటిష్టత కోసం మరింత కృషి చేయాలని, ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ వారిలో రాజకీయ చైతన్యం తీసుకురావాలని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 18 మండలాలు ఉండగా వీటిలో 16 మండలాలు ఏజెన్సీలోనే ఉన్నాయని గుర్తు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో పార్టీని మరింత పటిష్ట పరిచి గిరిజన సంఘంతో పాటు ఇతర సంఘాలను సైతం బలోపేతం చేయాలని తెలిపారు. పార్టీ కార్యకర్తలు సైద్ధాంతిక అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ మతోన్మాదం చొచ్చుకుపోతోందని, ఇక్కడ బీజేపీ బలపడటం చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. బీజేపీ ఈ దేశాన్ని హిందూ దేశంగా మార్చాలని చూస్తోందని, విద్వేషాలను రెచ్చగొడుతూ ఫాసిస్టు సిద్ధాంతాన్ని అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కేవలం అధికారం కోసమే పనిచేస్తోందని దుయ్యబట్టారు. బీజేపీకి వ్యతిరేకంగా సీపీఐ(ఎం) మాత్రమే గళమెత్తుతోందని గుర్తు చేశారు. ఎర్రజెండా పేదలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. ప్రజా పోరాటాలు మరింత ఉధృతం చేసి వారిలో రాజకీయ చైతన్యం తీసుకురావాలని సూచించారు. అనంతరం మహాసభలో పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, ఆశాలత, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, తొడసం భీంరావు, సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.మంజుల, సురేందర్, నాయకులు శకుంతల, లంక జమున తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మిడియం బాబురావు


మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు


అమరులకు నివాళులు అర్పిస్తున్న బండారు రవికుమార్


పార్టీ జెండా ఎగరేసిన సీనియర్ నాయకులు బండి దత్తాత్రి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

వరి ధాన్యం విక్రయించుకోవడం కోసం రైతుల సౌకర్యార్థం అందుబాటులో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార సంఘం సీనియర్ ఇన్స్‌పెక్టర్ పుష్పలత సూచించారు. సీఈఓ అర్జున్‌తో కలిసి శుక్రవారం మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం సహకారంతో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రైతుల సౌకర్యార్థం కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తూ రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం విక్రయించుకున్న రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు బోనస్ అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి చెలుకల శ్రీనివాస్, రైతులు కొట్రాంగి తరుణ్, మల్లేష్, దూట నరేష్, సెగ్యం తిరుపతి, అల్లూరి మల్లేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-జన్నారం

రాజ్యాంగంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ రాజ్‌మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మురిమడుగు ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించి, విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భారత రాజ్యాంగం ఆమోదించబడి 75 సంవత్సరాల వజ్రోత్సవంలో భాగంగా విద్యార్థులకు భారత రాజ్యాంగం గొప్పతనం, విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్ విజయకుమార్ పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షలు దగ్గర పడుతున్నందున క్రమశిక్షణతో పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను పాఠశాల అభివృద్ధిలో చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు అనుమల రాజన్న, కందుల తిరుపతి, అంకుష్, సురేష్ కుమార్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

అడవిలో ఉత్సాహంగా ట్రెక్కింగ్



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గడ్పూర్ గ్రామ పరిధిలోని ఎంసీసీ క్వారీలో శుక్రవారం అటవీ శాఖ, యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ట్రెక్కింగ్ ఉత్సాహంగా సాగింది. ఈ ట్రెక్కింగ్‌ను లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి అత్తె సుభాష్ ప్రారంభించగా మంచిర్యాలకు చెందిన పలువురు వైద్యులు, వారి కుటుంబ సభ్యులు, సిబ్బంది, ఇతర ఔత్సాహికులు మొత్తం 24 మంది పాల్గొన్నారు. ఈ ట్రెక్కింగ్ ఎంసీసీ క్వారీలోని పిక్నిక్ స్పాట్ నుంచి పూట వాగు వెంట ఉదయం 8 నుంచి 11 గంటల వరకు దాదాపు మూడు గంటల పాటు 4కిలోమీటర్లు సాగగా అంతా ఆసక్తిగా పాల్గొన్నారు. అడవిలోని గడ్డి వనాలు, ఎత్తైన కొండలు, అటవీ అందాలను తిలకిస్తూ ట్రెక్కింగ్‌లో పాల్గొని ఉత్సాహాన్ని పొందారు. ట్రెక్కింగ్‌కు ఎఫ్ఎస్ఓ అతావుల్లా, ఎఫ్‌బీవోలు రాజేందర్, సంతోష్, యూత్ హాస్టల్స్ అసోసియేషన్ సభ్యులు శ్యాంసుందర్, రవి ట్రెక్కింగ్‌కు నాయకత్వం వహించారు.

రేపు గాంధారీ ఖిల్లాలో..

అటవీ శాఖ ఆధ్వర్యంలో 1న ఆదివారం గాంధారీ ఖిల్లా వద్ద ట్రెక్కింగ్(హైకింగ్) నిర్వహిస్తున్నట్లు లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి అత్తె సుభాష్ తెలిపారు. ఉదయం 7గంటల వరకు చేరుకోవాలని 8 గంటలకు గాంధారీ ఖిల్లా 360 డిగ్రీల వద్ద ప్రారంభమయ్యే ఈ ట్రెక్కింగ్ 11గంటల వరకు జరుగుతుందన్నారు. మొదటి 30 మందికి రూ.100 ప్రవేశ రుసుంతో పాల్గొనే అవకాశం కలిపిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు బీట్ అధికారి రాజేందర్ సెల్9948805488ను సంప్రదించాలన్నారు.

ప్రజాపాలనపై కళాజాత



కెరమెరి : మండల కేంద్రంలో శుక్రవారం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాజాత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాజాత బృందం సభ్యులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆటపాటలతో అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును పాటల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అంజాద్ పాషా, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్, ఎస్సై అంజయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమెందుకు..?

- అటవీ జంతువుల కదలికలను పసిగట్టడంలో విఫలమవుతున్న ట్రాకర్స్
- నాలుగేళ్లలో ఐదుగురి మృతి
- అయినా రక్షణ చర్యలు కరువు

అప్పటి వరకు తమతో కలిసి మెలిసి తిరిగిన కుటుంబ సభ్యులలో ఒకరు అకస్మాత్తుగా మృతి చెందితే ఆ బాధ వర్ణనాతీతం. శత్రువుకు కూడా ఇలాంటి బాధ రావద్దని అనుకుంటాం. కాని అటవీ అధికారులు మాత్రం తమకిది మామూలేనని వదిలేస్తున్నారు. అడవుల నుండి జంతువులు పంట చేలలోకి వస్తే తామేం చేస్తామని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారంటే వారి విధి నిర్వహణ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎప్పటిలాగానే వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రానికి తిరిగి రావాల్సిన వ్యక్తి అనుకోకుండా అడవి జంతువుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నాడు. ఇది ఆ కుటుంబానికి శరాఘాతంగా మారుతోంది.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో పులుల సంచారం పెరిగింది. గతంలో ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్న పులుల సంఖ్య తగ్గిపోగా మహారాష్ట్ర నుండి పులుల రాకపోకలు పెరిగాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గత రెండు రోజుల నుండి అటవీ అధికారులు తూతూ మంత్రంగా ప్రకటనలు ఇవ్వడమే తప్ప క్షేత్ర స్థాయిలో తీసుకున్న చర్యలు శూన్యమేనని చెప్పొచ్చు. అడవి జంతువుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండేందుకు అటవీ శాఖ ట్రాకర్స్‌తో పాటు బేస్ క్యాంప్ వాచర్లను నియమించింది. వీరిని అవుట్‌సోర్సింగ్‌లో నియమించి శిక్షణ ఇస్తారు. వీరు బయోలజిస్ట్ పర్యవేక్షణలో నిత్యం అడవులలో సంచరిస్తూ పులులు, ఏనుగులు తదితర జంతువుల కదలికలను పసిగడుతూ ఉండాలి. ఈజ్‌గాం బెంగాళీ క్యాంప్ శివారులో శుక్రవారం జరిగిన పులి దాడి ఘటనలో అటవీ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. బెంగాళీ క్యాంప్‌ల శివారు పంట భూములలో పులి సంచరిస్తోందని ట్రాకర్స్‌కు సమాచారం అందింది. అయినా వీరు సమీప గ్రామాల రైతులు, కూలీలకు సమాచారం ఇవ్వలేదు. ప్రస్తుతం పత్తి సీజన్ కావడంతో నిత్యం వందల మంది రైతులు, కూలీలు పత్తి ఏరేందుకు చేలకు వెళుతున్నారు. వీరిని చేలకు వెళ్లవద్దని అటవీ సిబ్బంది అవగాహన కల్పించినా ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పులులు సంచరించే ప్రాంతం కావడంతో అటవీ అధికారులు గ్రామాలలో కళాజాత బృందాల ద్వారా, డప్పు చాటింపు ద్వారా అవగాహన కల్పించాల్సి ఉంటుంది. పులి ఎదురైతే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా వివరించాల్సి ఉంటుంది. తలలకు మాస్కులు ధరించేందుకు వాటిని రైతులకు అందించాలి. రెండేళ్ల క్రితం రైతులకు మాస్కులను పంపిణీ చేశారు. తల వెనుకభాగంలో ముఖం బొమ్మతో ఉన్న మాస్కులను అందిస్తే మనిషి తననే చూస్తున్నాడనే భావనతో పులి దాడి చేసే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఇలాంటి మాస్కులను ఇప్పటి వరకు రైతులకు అందించలేదు. ఈ కార్యక్రమాల కోసం అటవీ శాఖకు నిధులు భారీగా వస్తాయి. కాని ఈ నిధులు ఏమవుతున్నాయనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది.

అడవి జంతువుల బారిన పడి ఐదుగురు మృతి

2020 నుండి ఇప్పటి వరకు కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో అడవి జంతువుల బారిన పడి ఐదుగురు మృతి చెందారు. పులుల బారిన పడి ముగ్గురు మృతి చెందగా, ఏనుగు బారిన పడి ఇద్దరు మృతి చెందారు. 2020, నవంబర్ 11న దహెగాం మండలం దిగిడ గ్రామ సమీపంలోని పంట చేలో పులి దాడిలో విఘ్నేష్ మృతి చెందాడు. అదే నెల 29న పెంచికల్‌పేట మండలం కొండపల్లిలో పత్తి చేనులో పని చేస్తున్న పసుల నిర్మలపై పులి దాడి చేయడంతో ఆమె మృతి చెందింది. ప్రస్తుతం మోర్లె లక్ష్మి పులి దాడిలో మృతి చెందింది. అదేవిధంగా ఈ ఏడాది మార్చి 3న సాయంత్రం చింతలమానెపల్లి మండలం భూరెపల్లి గ్రామానికి చెందిన అల్లూరి శంకర్ మిర్చి తోటలో పని చేసేందుకు వెళ్లగా ఏనుగు తొక్కి హతమార్చింది. ఇదే ఏనుగు మార్చి 4న ఉదయం పెంచికల్‌పేట్ మండలం కొండపల్లికి చెందిన కారు పోశన్నను హతమార్చింది. పులి బారిన పడి ముగ్గురు, ఏనుగు బారిన పడి ఇద్దరు ఇప్పటి వరకు మృతి చెందారు.


సంఘటనాస్థలంలో చెల్లా చెదురుగా పడి ఉన్న లక్ష్మి ఏరిన పత్తి


మార్చిలో ఏనుగు దాడిలో మృతి చెందిన శంకర్ (ఫైల్)


బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న డీఎఫ్ఓ నీరజ్ టిబ్రేవాల్


కాగజ్‌నగర్ డివిజన్‌లో సంచరించిన ఏనుగు (ఫైల్)


పులి దాడి చేయకుండా ఉండేందుకు మాస్కులను ధరించి అడవిలోకి వెళుతున్న ట్రాకర్లు

వాసులు చేసిన పైసలు వాపసివ్వాలి : ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

నవతెలంగాణ-మంచిర్యాల

గోదావరి నదీ తీరంలో శ్మశాన వాటిక నిర్మాణం పేరుతో పట్టణ ప్రజల నుండి వసూలు చేసిన విరాళాలను తిరిగి ఇవ్వాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుకు పరోక్షంగా హితవు పలికారు. డిసెంబర్ 7లోపు ఎవరి డబ్బులు వారికి తిరిగి చెల్లించాలని గడువు ఇచ్చారు. శుక్రవారం పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి వ్యాపారస్తులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్మశాన వాటిక నిర్మాణం కోసం అనేక మంది నుంచి సుమారు రూ.90లక్షల చందాలు వసూలు చేసి నెలలు గడుస్తున్నాయని, శ్మశాన వాటిక మాత్రం నిర్మించలేదని తెలిపారు. వసూలు చేసిన విరాళాలను దాతలకు తిరిగి ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని నిలదీశారు. ఏడవ తేదీ లోపు దాతల డబ్బులు తిరిగి ఇవ్వకపోతే 8, 9 తేదీల్లో చందాలు వసూలు చేసిన వారిపై, మధ్య వర్తులుగా ఉన్న వారిపై ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేస్తారని హెచ్చరించారు. ఎన్ని శక్తులు అడ్డుకోవాలని చూసిన నియోజకవర్గ అభివద్ధి, సంక్షేమం ఆగబోదని తేల్చి చెప్పారు. ప్రతిపక్షాలు అభివృద్ధిని చూసి ప్రశంసించాలి తప్ప అసత్య ప్రచారం చేసి పరువు తీసుకోవద్దని సూచించారు. రెండేళ్లలో 20ఏండ్ల అభివృద్ధి చేసి చూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా అధికారికంగా సంబరాలు జరుపుకుంటున్న తరుణంలో బీఆర్ఎస్ జెండాలు ఏర్పాటు చేయడం సరి కాదని, మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల పరిధిలో ఉన్న డివైడర్లకు, సర్కిళ్ల వద్ద, రోడ్డు పక్కల జెండా తోరణాలు, జెండాలను ఉద్దేశపూర్వకంగా ఏర్పాటు చేశారని ఆరోపించారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన జెండాలను మున్సిపల్ అధికారులు, పోలీసులు తొలగించారని స్పష్టం చేశారు. అనంతరం శ్మశాన వాటిక నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, పలువురు కౌన్సిలర్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

నవతెలంగాణ - చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని బాబాసాగర్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధమైంది. యజమాని గుర్లె ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం..గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశాడు. నాలుగు రోజుల నుండి తీసిన 30 క్వింటాళ్ల పత్తిని ఇంటి ముందు రేకుల షెడ్‌లో నిల్వ ఉంచాడు. ప్రమాదశత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. గ్రామస్తులు మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించినప్పటికీ సగం పత్తి కాలిపోయింది. సంవత్సరం అంతా కష్టపడి పండించిన పంట తన కళ్లముందే మాడి మసి అవడంతో రైతు కన్నీరు మున్నీరవుతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని మొరపెట్టుకుంటున్నాడు.



ఉపాధ్యాయుడికి పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని పులిమడుగు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఆడే దినేష్ శుక్రవారం ఉదయం తెల్లవారుజామున మండలంలోని నాగపూర్ వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడటంతో తీవ్రమైన గాయాలయ్యాయి. కాగా ఆయన రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్ రిమ్స్‌కు వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్, నారాయణ నాయక్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ జాధవ్ శ్రీరామ్‌నాయక్, బాలాజీ కాంబ్లే, తిరుపతి పాల్గొన్నారు.



ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు మాతృ వియోగం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజుకు మాతృవియోగం కలిగింది. చింతకుంట్ల దేవుబాయి శుక్రవారం ఉదయం తుది శ్వాసను విడిచారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న ధోబి కాలనీలోని వారి నివాసానికి చేరుకొని కమిషనర్ కలిసి పరామర్శించారు. అలాగే శాంతినగర్‌కు చెందిన జాఫర్ మైనార్టీ వెల్ఫేర్ హాస్టల్లో గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శాంతినగర్‌లోని వారి నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.



ఆశాలకు నిర్ణీత వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మూడో మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి
- కార్మిక లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ఆశాలకు నిర్ణీత వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, కార్మిక లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. శుక్రవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మూడో జిల్లా మహాసభను జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవనంలో నిర్వహించారు. అంతకుముందు ధర్మసాగర్ చెరువు మినీ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి టీఎన్జీఓ భవనం వరకు పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభలో ఆమె మాట్లాడారు. ఆశా కార్యకర్తలు అనేక పని ఒత్తిడి తట్టుకొని నిత్యం సేవలు అందిచటం వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డ్స్, రివార్డ్ వస్తున్నాయని అన్నారు. ఈ మేరకు తమకు కనీస వేతనం నిర్ణయం చేయాలని ఆందోళన చేస్తుంటే, నిర్లక్ష్యం వహిస్తూ, అందరిని రోడ్ మీద పడేశారని విమర్శించారు. కనీస వేతనం రూ.18 వేలు వచ్చేవరకు పోరాటం ఆపేది లేదని తేల్చి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో నిర్ణిత వేతనం రూ.10వేలు అమలు చేస్తున్నారని, కేరళ రాష్ట్రంలో రూ.18వేలు ఇస్తున్నారని తెలిపారు. ధనిక రాష్ట్రం బంగారు తెలంగాణలో కనీసం ప్రమాద బీమా సౌకర్యం పొందలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక లేబర్ కోడ్ చట్టాలు రద్దు చేసి, నాలుగు కోడ్‌లుగా తీసుకురావడం కార్మికులకు నష్టం చేసే విధంగా ఉందన్నారు. వెంటనే కార్మిక లేబర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు వేతనం రూ.18 వేలు ఇచ్చే విధంగా ఈ అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆశ వర్కర్లకు జాబ్‌కు సంబంధించిన పనులే చెప్పాలన్నారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన. సురేష్ మాట్లాడారు. ఆశా వర్కర్లకు రాష్ట్రంలో రూ.18 వేల ఇవ్వాలని, ఆశ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై డిమాండ్ చేస్తూ, డిసెంబరు 15వ తేదీ నుంచి ఆశ వర్కర్ రాష్ట్ర బస్సు యాత్ర నిర్మల్ నుంచే ప్రారంభమవుతుందని తెలిపారు. దీనికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఆశ వర్కర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి, అదేవిధంగా ఆల్ ఇండియా నాయకులు ఈ బస్సు యాత్రలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పోశెట్టి, నాయకులు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక...

ఆశ వర్కర్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా బి.సుజాత, ఉపాధ్యక్షులుగా చంద్రకళ, విజయ, సరిత, ఇంద్రమాల సరిత, అనసూయ, సుగుణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గంగామణి, జిల్లా సహాయ కార్యదర్శిగా శ్యామల, సులోచన, విజయ, జ్యోతి పద్మ, విజయ, జిల్లా కోశాధికారిగా రామలక్ష్మిలను ఎన్నుకున్నారు.



సమగ్రశిక్ష ఉద్యోగులు ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

రాష్ట్ర సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవదర్శన్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ వరంగల్ డిక్లరేష్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని మాటిచ్చారని, సమగ్ర ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంజుల, ప్రియాంక, సీసీఓ అఫ్రిన్, కాశి, ఐఈఆర్‌పీ రాజన్న, నరేష్, సీఆర్పీ విజయ్, అశ్వక్, శంకర్, రాజేశ్వర్, జావేద్, తేజస్వి పాల్గొన్నారు.

సర్వే డాటాను ఆన్‌లైన్‌లో సకాలంలో నమోదు చేయాలి



నవతెలంగాణ-తలమడుగు

సర్వే డాటాను ఆన్‌లైన్‌లో సకాలంలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్వేకు సంబంధించిన డాటా ఆన్‌లైన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి ఒక్కరూ రోజుకు 40 సర్వే ఫారమ్‌లను నమోదు చేయాలని కోరారు. డాటా నమోదు కార్యక్రమంలో మండలం వెనుకబడి ఉందని, సిబ్బంది వేగవంతం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. డాటా నమోదులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ శేఖర్, మండల సిబ్బంది నగేష్, ఉమా, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

కేసీఆర్ పాలనను తిరిగి కోరుకుంటున్న ప్రజలు

- మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చావు నోట్లో తల పెట్టి తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన మాజీ ముఖ్యమంత్రి, ఉద్యమ నేత కేసీఆర్ పాలనను ప్రజలు తిరిగి కోరుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై తీవ్ర అసంతృప్తి నెలకొందని మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం దీక్షా దివస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ కాలం నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, అదే స్ఫూర్తితో ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో అనేక అడ్డంకులు ఎదురైనా వాటికి నిలబడి పోరాడిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఎన్ని ఉద్యమాలు చేసినా ఆనాడు కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వడానికి సుముఖత చూపలేదని, పోరాటాలను చూసి తెలంగాణ ప్రకటన చేసిన తర్వాత ఉమ్మడి ఆంధ్ర పాలకుల ఒత్తిడితో వెనక్కి తీసుకుందని అన్నారు. ఆనాటి నుండే తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసేందుకు కేసీఆర్ విశేష కృషి చేశారని అన్నారు. అనేక మంది మేధావులు, సామాన్య ప్రజలను కలుస్తూ, వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నారని పేర్కొన్నారు. దాదాపు పన్నెండు వందల మంది అమరులు అసువులు బాసిన తర్వాత తెలంగాణ ప్రకటన చేశారని గుర్తు చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకేళ్లిందన్నారు. అంతకుముందు మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ తెలంగాణను సాధించడం కేసీఆర్‌తో సాధ్యమా అన్న సందేహాలకు సమాధానంగా ఆయన రాష్ట్రాన్ని సాధించి చూపారని, పదేండ్ల పాలనలో పురోగతి పథంలో రాష్ట్రం నడిచిందని అన్నారు. 2009 డిసెంబర్ 9న పార్లమెంట్‌లో తెలంగాణ ప్రకటన చేస్తే అప్పటి ఆంధ్ర పాలకులతో సహా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఆ నిర్ణయానికి అడ్డం పడ్డారని, వారి కారణంగానే తిరిగి తెలంగాణ ప్రకటనను వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. ఆనాటి నుండే స్వరాష్ట్రం కోసం పోరాటం తప్పదని గుర్తించి, టీడీపీ పార్టీకి రాజీనామా చేసి ఉద్యమంలో భాగస్వామ్యులు అయినట్లు తెలిపారు. టీడీపీలో ఉంటూ కూడా ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ఎదుట దీక్ష చేసిన విషయాన్నీ గుర్తు చేశారు. కేసీఆర్ లేకుంటే ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి కుడా ఉండేవాడు కాదన్నారు. సోనియాను బలిదేవత అన్న వ్యక్తి ఆమెను ప్రస్తుతం పొగుడుతుండటం హాస్యాస్పదమని అన్నారు. అన్నదాతలు, సామాన్య ప్రజలు, మహిళలు, పెన్షన్ దారులు ఇలా అన్ని వర్గాలను మోసం చేసిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహించడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని, గ్రామగ్రామాన ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ, చైతన్యపరచాల్సిన అవసరముందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని, ఆదివాసులకు ఇచ్చిన హక్కు పత్రాలకు సైతం అన్ని పథకాలను వర్తింపచేయాలనీ డిమాండ్ చేశారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఉద్యమకాలం నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. 2001 నుంచి తాను తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్రను వివరిస్తూ ఆనాటి రోజులను మరోసారి మననం చేసుకున్నారు. కేసీఆర్ అనునిత్యం రాష్ట్రప్రజల శ్రేయస్సు కోసం తపించే నాయకుడని, ఆయనపై అర్ధరహిత విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో వందకు వంద శాతం వంద సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు పాల్గొన్నారు.



పోలీస్ ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు సిడం నగేష్ ఇటీవల తొమ్మిది నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకుని గ్రామానికి వచ్చిన శుభ సందర్భంగా గ్రామస్తులు అందరూ కలిసి శుక్రవారం శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెందూర్ జుగాది రావు, గ్రామపటేల్ నైతం చిత్రు, కొడప రాము, నైతం జంగు, గ్రామ కార్యదర్శి జాదవ్ పండిత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన తాళ సప్తమి వేడుకలు

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని విఠలేశ్వర్ ఆలయంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న తాళ సప్తమి వేడుకలు శుక్రవారం ముగిశాయి. దీంతో ఉదయం విఠల్ రుక్మిణి దేవత మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి విఠల్ రుక్మిణిబాయి దేవతలకు కాకడ హారతి ఇచ్చి, గ్రామంలో ఉన్న ప్రధాన విధుల గుండా పల్లకి ఊరేగింపు చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న యాదవ్ సంఘం, మున్నూరుకాపు సంఘంతో పాటు గ్రామస్తులు అందరూ కలిసి దాదాపుగా 40 క్వింటాళ్ల బియ్యంతో బండార కార్యక్రమం చేపట్టారు. దీంతో ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాదిలో కార్తీక మాసంలో నిర్వహించే సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దీంతో గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి హాజరై విఠల్ రుక్మిణి దేవత విగ్రహలకు దర్శించుకునేందుకు గ్రామంలో ఉన్న మహిళలు యువకులతో పాటు చుట్టు ప్రక్కల ప్రజలు బారులు తీరారు. ఈ ఉత్సవాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తుగా భైంసా రూరల్ సీఐ నైలు, కుభీర్ ఎస్సై రవీందర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు పెంటాజీ బోయిడి విఠల్ సిద్ధం వివేకానందు పుప్పాల పీరాజీ నాగలింగం, సూది రాజన్న, సంతోష్, ఆయా కుల సంఘాల సభ్యులు ఉన్నారు.

మిత్రుని జ్ఞాపకార్థం రక్తదానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన కీ.శే.ఎన్.వినిత్‌రావు జ్ఞాపకార్థం ఆయన మిత్రులు శుక్రవారం రిమ్స్ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. గత తొమ్మిది సంవత్సరాలుగా వినీత్‌రావు జ్ఞాపకార్థం రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన మిత్రుడు సూది నరేష్ తెలిపారు. కార్యక్రమంలో మిత్ర బృందం సభ్యులు ధర్మపాల్, ఆయన సోదరుడు వినిల్‌రావు పాల్గొన్నారు.

యూఆర్ఎస్ పాఠశాలను సందర్శించిన డీఈఓ



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల యూఆర్ఎస్‌ను శుక్రవారం డీఈఓ రామారావు పరిశీలించారు. పాఠశాలలోని మధ్యాహ్న భోజనం వండే పరిసరాలు, వంటశాలను తనిఖీ చేశారు. వంట సరుకుల నాణ్యత, గడువు తేదీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వంట కోసం తాజా కూరగాయలు వాడాలన్నారు. అలాగే వంటనూనె, పప్పు దినుసులు, ఇతర సామాగ్రి గడువు తేదీని రోజు పరిశీలించి ఉపయోగించాలన్నారు. వంట చేసే వారు హెడ్ క్యాప్ అప్రాన్ వాడుతూ చేతుల శుభ్రత పాటించాలన్నారు. బియ్యంలో పురుగులు లేకుండా చూసి, శుభ్రమైన నీటిచే 2, 3 సార్లు కడిగి వంటకు వినియోగించాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలన్నారు. విద్యార్థులు సైతం గోర్లు కత్తిరించుకొని, చేతుల శుభ్రత మొదలగునవి పాటించాలని తెలియజేశారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు నర్సయ్య, సలోమీ కరుణ, లింబాద్రి, పాఠశాల ప్రత్యేకాధికారి క్రాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్ కొండపై ఉన్న వెంకటేశ్వర ఆలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపై వెలసిన వెంకటేశ్వర ఆలయంలో ఎన్ని సంవత్సరాల క్రితం నిర్మించారని ఆలయ పూజారిని అడిగి తెలుసుకున్నారు. కొండపై వాతావరణం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, వైద్యాధికారులు శ్రీకాంత్, హరీష్, గ్రామస్తులు కేదారేశ్వర్‌రెడ్డి, స్వామి, రమకాంత్, మల్లేష్ ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలి

- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నవతెలంగాణ-నిర్మల్

అంగన్‌వాడీల్లోని చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రి గార్డెన్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ న్యూట్రి గార్డెన్స్‌లో పెంచిన ఆకు కూరలు, కూరగాయలను చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందజేసి ఆహార తయారీకి ఉపయోగించాలన్నారు. ప్రతి ఒక్క చిన్నారి, గర్భిణి, బాలింతలకు మధ్యాహ్న భోజనం, కోడిగుడ్డు, ఇతర పోషకాలను అందించి రక్తహీనత, ఎదుగుదల లోపం వంటి సమస్యలను నియంత్రించాలని తెలిపారు. చిన్నారులకు క్రమం తప్పకుండా బాలామృతాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీలలో అందించే మధ్యాహ్నం భోజనానికి నాణ్యమైన సరుకులను మాత్రమే వాడాలని తెలిపారు. వస్తువుల గడువు తేదీ ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. చిన్నారులకు స్వచ్ఛమైన తాగునీరుని అందించాలని తెలిపారు. మండలాల వారిగా అంగన్‌వాడీల్లో నిర్వహిస్తున్న న్యూట్రి గార్డెన్స్, సామ్, మామ్ ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను నమోదు చేసి నివేదికలను అందజేయాలన్నారు. అంగన్‌వాడీల పరిసరాలలో నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. సమావేశంలో సీడీపీఓ నాగలక్ష్మి, నాగమణి, సరిత, సరోజిని, జిల్లా సమన్వయకర్త నిరంజన్‌రెడ్డి, అన్ని మండలాల అంగన్‌వాడీ పర్యవేక్షకులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లెక్కల మాస్టారుగా మారిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్ గ్రామ ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు లెక్కలు బోధిస్తూ, విద్యార్థులతో చేయిస్తూ, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ తరగతి గదిలో లెక్కల మాస్టారుగా మారిన జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని విద్యార్థులను కోరారు. బయట చిరుతిండ్లు తినకుండా ఇంట్లో అమ్మ చేసిన వంటలనే తినాలని విద్యార్థులను కోరారు. గుట్కా, పాన్ మసాలా, సిగరెట్, మద్యానికి దూరంగా ఉండాలని అన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు లెక్కలు బోధించారు. జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయుడుగా మారి తమకు పాఠాలు బోధించడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని, ఉన్నత స్థానానికి చేరుకోవాలని విద్యార్థులను కోరారు. తాము నిర్దేశించుకున్న లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. పదిలో వందకు వందశాతం ఫలితాలు సాధించాలని, అందుకు విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఏదైనా సబ్జెక్టుల్లో వెనుకబడితే ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందనీ అన్నారు. రేపటి భావిభారత పౌరులు మీరే మంచి మార్గంలో నడిచి ఆదర్శప్రాయంగా నిలవాలని తెలిపారు. పాఠశాల ఆవరణలో నాటిన వంకాయ టమాట నర్సరీని పరిశీలించారు. విద్యా బోధన ఉపాధ్యాయుల పనితీరును జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, డీఎంహెచ్ఓ నరేందర్, మలేరియా అధికారి శ్రీధర్, ఎంపీడీఓ, శేఖర్, వైద్యాధికారులు శ్రీకాంత్, హరీష్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, గ్రామస్తులు కేదరేశ్వర్‌రెడ్డి, మాదూరి మల్లేష్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మెన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-రెబ్బెన



పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం ఎంఈఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాయ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, గుడ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రూ.10,000లు ఇవ్వాలన్నారు. గుడ్లకు అదన బడ్జెట్ కేటాయించాలని లేదా అంగన్‌వాడీ సెంటర్స్‌కు సప్లయ్ చేసినట్లుగా మధ్యాహ్న భోజన పథకానికి కూడా సప్లయ్ చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరి, గిరి బాయి, రత్నను బాయి, విజయ, మంజుల, పార్వతి, పద్మ, నిర్మల, అరుణ పాల్గొన్నారు.

వెలిగి ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని వెలిగి ఆశ్రమ పాఠశాలను ఎంపీడీఓ వీ.ప్రవీణ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం హాస్టల్ వంట, స్టోర్ గది, స్నానపు గదులు, డార్మెంటరీలను హాస్టల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. సరుకుల స్టాక్ రిజిస్టర్, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, విద్యార్థుల హాజరు వివరాలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ హాస్టల్‌లో సమస్యల గురించి ఆరా తీశారు. కాగా హాస్టల్‌లో ఆర్ఓ వాటర్ ప్లాంట్ పని చేయడం లేదని విద్యార్థులు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న సమస్యలను జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం ఎస్. దామోదర్, పాఠశాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి నితీష్ రావు ఉన్నారు.

కోల్ ఇండియా స్థాయిలో రాణించాలి

- బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఉద్యోగ క్రీడాకారులు ఏరియాలతో ప్రమేయం లేకుండా కోల్ ఇండియా స్థాయిలో రాణించి పతకాలు సాధించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం డబ్ల్యూపీఎస్, జీఏ 91వ వార్షిక క్రీడా పోటీలలో భాగంగా గోలేటిలోని శ్రీభీమన్న మైదానంలో నిర్వహించిన నియర్ బై అథ్లెటిక్స్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు వసతుల కల్పనలో సింగరేణి యాజమాన్యం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మందమర్రి, బెల్లంపల్లి ఏరియా క్రీడాకారులు సమిష్టిగా సమన్వయంతో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి సింగరేణికి దేశ వ్యాప్తంగా ఉన్న క్రీడా కీర్తిని మరింత గా పెంచాలన్నారు. గతంలో కోల్ ఇండియా స్థాయిలో రాణించిన ఉద్యోగ క్రీడాకారులను అభినందించారు. నియర్ బై పోటీల్లో ప్రథమ స్థానాల్లో నిలిచిన ఉద్యోగ క్రీడాకారులు కంపనీ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు బయ్య మొగిలి, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీఓ ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, బెల్లంపల్లి ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్, జనరల్ క్యాప్టెన్ చంద్ర కుమార్ పాల్గొన్నారు.

పశుగణన పగడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా పశువైద్యాధికారి సురేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా వైద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేసి పశుగణన చేస్తున్న ఎన్యుమరేటర్‌ను గణన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికెళ్లి పశుగణనను చేయాలని, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పశు గణన వల్ల దేశంలో ఎన్ని కుటుంబాలు పశు సంపదపై ఆధారపడి ఉన్నాయో తెలుస్తుందని, వాటి ఆధారంగానే రాబోవు రోజుల్లో పాడి రైతులకు పథకాలు రూపొందిస్తారని తెలిపారు. అనంతరం కృత్రిమ గర్భధారణ ద్వార జన్మించిన దూడల్ని పరిశీలించారు. పాడి రైతులందరూ పశుసంవర్థక అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. దానిలో భాగంగానే కృత్రిమ గర్భధారణ ద్వార 90శాతం ఆడ దూడలు జన్మించే వీర్యం (లింగ నిర్ధారణ వీర్యం) ప్రతి పశు వైద్య శాలలో అందుబాటులో ఉంచడం జరిగిందని, ఈ అవకాశాన్నీ పాడి రైతులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పశు వైద్యశాలని సందర్శించి పలు రికార్డ్స్‌నీ తనిఖీ చేసి పశువైద్య అధికారి రాకేష్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సురేష్, సిబ్బంది శివ, పశుగణన ఎన్యుమరేటర్ శేఖర్, రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అర్హులైన వారిని నియమించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న అటెండర్ కుక్ అసిస్టెంట్ కుక్ పోస్టుల్లో అర్హులను మాత్రమే నియమించాలని డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గమినియల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీలో ఖాళీగా ఉన్న నాలుగో తరగతి ఉద్యోగుల కోసం ఈ నెల మొదటి వారంలో నోటిఫికేషన్ వేశారని అన్నారు. అయితే ప్రస్తుతం వీటి నియామకాల్లో కొన్ని మండలాల్లో స్థానికత చూడకుండా అధికార పార్టీ అండదండలతో నియామకాలు జరుగుతున్నాయని తెలిసిందన్నారు. పోస్టులకు కావాల్సిన స్థానికతను మాత్రమే చూడాలని వేరే ప్రాంతం నుండి వచ్చిన అనర్హులను ఎంపిక చేయవద్దని అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ పాల్గొన్నారు.

రైతుపండుగను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని రైతువేదిక వద్దలో శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతుపండుగ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారని వ్యవసాయ విస్తరణ అధికారి రాజేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమం దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా ప్రత్యక్ష ప్రసారం నిర్వహించడం జరుగుతుందని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న కంకలమ్మ జాతర

నవతెలంగాణ-కౌటాల

ప్రతి సంవత్సరం కార్తీక మాసం చివరి ఆదివారం కంకలమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న కంకలమ్మ గుట్టపై గురువారం ఆలయ కమిటీ చైర్మన్ సులువ కనకయ్య ఆధ్వర్యంలో ఆలయ పూజారి ప్రకాష్‌తో కంకలమ్మ కేతేశ్వర స్వామి జెండా ఆవిష్కరించి జాతరను ప్రారంభించారు. రెండవ రోజు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కుంకుమార్చన పూజా నిర్వహించారు. ఈ జాతరకు మహారాష్ట్ర, కర్నాటక తమిళనాడు ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలి వస్తారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మండలంలోని మహిళా భక్తులు పాల్గొన్నారు.

పత్తి ఏరేందుకు వెళ్లి..పులి పంజాకు బలై..

- పులి దాడిలో మహిళ మృతి
- మృతదేహంతో కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయం ముందు ధర్నా



పులి దాడిలో మృతి చెందిన మోర్లె లక్ష్మి..ఇన్‌సెట్‌లో లక్ష్మి (ఫైల్)



తెల్లవారింది. రోజులాగానే ఇంట్లో పనంతా పూర్తి చేసుకొని తన అత్తతో కలిసి పత్తి ఏరేందుకు బయల్దేరింది. అదే గ్రామానికి చెందిన మరో నలుగురితో కలిసి ఆటోలో హుషారుగా వెళ్లిన ఆమెకు తెలియదు పంట చేనులో తన కోసం పులి మాటు వేసి ఉందనీ, తన ప్రాణం తీస్తుందని. ఉదయం ఎనిమిది గంటలకు పంట చేనులో అడుగు పెట్టిన ఆమె చకాచకా పత్తి ఏరడం ప్రారంభించింది. అరగంట తర్వాత అక్కడే మాటు వేసి ఉన్న పులి ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి హతమార్చింది. ఇదీ శుక్రవారం కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం బెంగాళీ క్యాంపు శివారులోని పంట చేనులో జరిగిన పులి దాడి ఘటన.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం బెంగాళీ క్యాంప్ నెం.6కు, బెంగాళీ క్యాంప్ నెం.11కు మధ్య ఐదెకరాల పంట చేను ఉంది. దీనిని సిర్పూరు (టి) మండలం వేంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి కౌలు తీసుకొని పత్తి పంట వేశాడు. 25 రోజుల క్రితం మొదటి విడతగా పత్తి ఏరించాడు. ప్రస్తుతం రెండో విడత పత్తి ఏరుతున్నారు. కాగజ్‌నగర్ మండలం గన్నారంకు చెందిన మోర్లె లక్ష్మి (22)తో పాటు మరో ఐదుగురు మోర్లె మిట్టుబాయి (మృతురాలి అత్త), ఏట పోశక్క, గట్టు రోజా, గుర్లె సావిత్రి, శకుంతలలు శుక్రవారం పత్తి ఏరేందుకు గన్నారం నుండి ఆటోలో పత్తి చేనుకు వెళ్లారు. ఉదయం 8 గంటలకు పత్తి ఏరడం ప్రారంభించారు. సరిగా అరగంట తర్వాత 8-30కు అప్పటికే చేనులో మాటు వేసి ఉన్న పులి ఒక్కసారిగా వెనుకనుండి లక్ష్మిపై దాడి చేసింది. మెడ భాగంలో పంజాతో దాడి చేసి నోటికి చేజిక్కించుకుంది. ప్రారంభంలోనే లక్ష్మి అరుపులకు తోటి కూలీలు వెళ్లి చూడగా అప్పటికే లక్ష్మి పులి నోట ఉండడంతో భయంతో వీరంతా కేకలు వేస్తూ పరుగులు తీశారు. పొలం కౌలుకు తీసుకున్న వారితో పాటు అక్కడ ఉన్న వారంతా కలిసి గట్టిగా అరుస్తూ పొలంలోకి వెళ్లి చూడగా అప్పటికే పులి పారిపోయి ఉండడం, లక్ష్మి తీవ్రగాయంతో అపస్మారక స్థితికి వెళ్లడంతో ఆమెను వెంటనే కాగజ్‌నగర్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సంఘటనాస్థలంలో ఉన్నా పత్తి చేలోకి వెళ్లేందుకు అటవీ సిబ్బంది వెనుకంజ

మోర్లె లక్ష్మిపై పులి దాడి చేసిన సమయంలో అక్కడే ట్రాకర్లు, బేస్ క్యాంప్ వాచర్లు ఉన్నారు. ఉదయమే అక్కడ ఉన్న రైతులు తమకు పులి కనిపించిందని సమాచారం ఇవ్వడంతో ట్రాకర్లు, వాచర్లు అక్కడికి చేరుకొని పులి కదలికలను పసిగట్టే పనిలో ఉన్నారు. అపుడే రైతులు, కూలీలను పంట చేల్లోకి వెళ్లవద్దని వారు అడ్డుకుంటే ఈ సంఘటన జరిగి ఉండేది కాదు. లక్ష్మిపై పులి దాడి చేసిన సమయంలో తోటి కూలీలు కేకలు వేస్తూ బయటకు వచ్చి పులి సమాచారాన్ని ట్రాకర్లకు అందించారు. అయినా వారు చేనులోకి వెళ్లేందుకు వెనుకంజ వేశారు. పక్క చేలోని వారు రోడ్డుమీద పోయేవారు గుమికూడిన తర్వాత అందరితో కలిసి వీరు చేలోకి వెళ్లారు. అప్పటికే లక్ష్మి పరిస్థితి విషమించి మృతి చెందింది.

మృతదేహంతో ఆందోళన

లక్ష్మి మృతదేహంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు వివిధ పార్టీల నాయకులు కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే లక్ష్మి మృతి చెందిందని ఆరోపిస్తూ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఒక దశలో ఆగ్రహించిన గ్రామస్తులు మృతదేహాన్ని కార్యాలయంలోనికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. డీఎఫ్ఓ ఇక్కడికి వచ్చి సమాధానం చెప్పాలని, రూ. 50 లక్షల పరిహారం, ఐదెకరాల సాగుభూమి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళన క్రమేణ పెరుగుతుండడంతో పోలీసు బలగాలను పెద్ద ఎత్తున రప్పించారు. డీఎఫ్ఓకు సమాచారం ఇచ్చి రావాలని పోలీసు అధికారులు చెప్పడంతో 2 గంటల తర్వాత ఎస్పీ శ్రీనివాస్‌రావుతో కలిసి డీఎఫ్ఓ నీరజ్ టిబ్రేవాల్ కార్యాలయానికి వచ్చారు. ముందుగా మృతదేహం వద్దకు చూసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు, పార్టీల నాయకుల డిమాండ్లను విని కార్యాలయంలోనికి వెళ్లి ఎస్పీతో పాటు అటవీ అధికారులు, పలు పార్టీల నాయకులతో చర్చలు జరిపారు. సీసీఎఫ్ శాంతారాం కూడా రావడంతో ఆయన కూడా చర్చలు జరిపారు. చివరికి ప్రభుత్వం నుండి మంజూరయ్యే రూ. 10 లక్షల చెక్కును శుక్రవారం సాయంత్రమే ఇస్తామని, మిగిలిన రూ. 10 లక్షల కోసం ప్రభుత్వానికి నివేదించి వచ్చేలా చూస్తానని డీఎఫ్ఓ నీరజ్ టిబ్రేవాల్ హామీ ఇచ్చారు. 5 ఎకరాల అసైన్డ్ భూమి కోసం కలెక్టర్‌కు లేఖ రాస్తానని, భర్తకు వాచర్ ఉద్యోగాన్ని డిసెంబర్ 1న ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న గ్రామస్థులు, నాయకులు

మేటింగ్ సమయం కావడంతో అప్రమత్తంగా ఉండాలి : డీఎఫ్ఓ నీరజ్ టిబ్రేవాల్

'ప్రతీ ఏటా అక్టోబర్ నుండి ఏప్రిల్ మధ్యకాలంలో పులులు సంచరిస్తూ ఉంటాయి. ఇది వాటికి మేటింగ్ (కలయిక) సమయం కావడంతో ప్రతీ రోజు తన జోడీ కోసం 30 నుండి 40 కిలోమీటర్లు కూడా పయనిస్తుంది. ఈ సమయంలో పంట చేలలోకి కూడా వస్తుంది. కాబట్టి రైతులు, కూలీలు ఉదయం పది గంటలకు ముందు, సాయంత్రం ఐదు గంటల తర్వాత పంట చేలకు వెళ్లవద్దు. ప్రస్తుతం లక్ష్మిపై దాడి చేసిన పులి కొత్తగా వచ్చింది. మహారాష్ట్ర తాడోబా అభయారణ్యం నుండి వచ్చి ఉంటుందని మేము భావిస్తున్నాం.'

భోజన విషయంలో రాజీపడొద్దు

- హాస్టల్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ డైరెక్టర్

నవతెలంగాణ-వాంకిడి

వసతి గృహంలోని విద్యార్థులకు అందించే భోజనంలో రాజీపడొద్దని ట్రైబల్ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఇక్కడ జరిగిన సంఘటనకు సంబంధించిన శైలజ మృతి పట్ల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటన జరిగిన కారణాల గురించి పాఠశాల సిబ్బందిని అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్లు, వంటగది, స్నానపు గదులు, మురుగు కాలువ అన్నింటిని కలియ తిరుగుతూ అదనపు గదులు ఎలా ఉన్నాయని పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా గదుల కోసం అదనపు గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్మాణానికి సంబంధించి నివేదికను రూపొందించి పంపించాలని పాఠశాల సిబ్బందిని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నాణ్యమైన భోజనం అందించాలని, ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తుండాలని, జరిగిన సంఘటన గురించి మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యాధికారిని వినయ్‌ను మృతిచెందిన శైలజ గురించి ఫుడ్ పాయిజన్ జరిగిందా లేక బయట ఫుడ్ వల్ల జరిగిందా అని ఈ సంఘటనపై పూర్తి వివరాలను డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇకముందు ఇలాంటి సంఘటనలు జరుగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పిల్లలకు బయటి నుండి ఎవరైన తిను బండారాలు, భోజనాలు ఇవ్వకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట డీటీడీఓ రమాదేవీ, తహసీల్దార్ రియాజ్ హైమద్, అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



వంట గదిని పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి

317 బాధితులను సొంత జిల్లాలకు పంపించాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత ప్రభుత్వ నిరంకుశ తప్పుడు నిర్ణయాల వల్ల రాత్రికిరాత్రి తీసుకువచ్చిన చీకటి జీఓ 317 ద్వారా వేలాదిగా ఉద్యోగ ఉపాధ్యాయులు తమ స్థానికతను కోల్పోయారని వారిని వెంటనే సొంత జిల్లాలకు పంపించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులకు సమావేశంలో మాట్లాడుతూ స్థానికత ఆధారంగా పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో చివరికి మళ్ళీ స్థానికత కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 317 జీఓపై సబ్ కమిటీ వేయడం అభినందనీయమని, కమిటీలతో కాలయాపన చేయకుండా సబ్ కమిటీ రిపోర్ట్‌ను వెంటనే తెలియపరచాలని, 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరినీ వారి స్థానిక జిల్లాలకు పంపించాలన్నారు. స్థానికత కోల్పోయి తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హేమంత్ షిండే, జిల్లా కోశాధికారి రమేష్, జిల్లా బాధ్యులు ఊషన్న, సుభాష్, మండలాల నాయకులు రవి, వర్ణ, సమ్మయ్య, విటోబా, సత్యనారాయణ, శివమణి పాల్గొన్నారు.

కాంట్రాక్టు తరగతులకు హాజరు కావాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా అడ్మిషన్ తీసుకున్న ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు కాంట్రాక్టు మరియు కౌన్సిలింగ్ తరగతులకు హాజరు కావాలని స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1, 8, 14, 15, 22 మరియు 29వ తేదీలలో కళాశాలలో కాంట్రాక్టు, కౌన్సిలింగ్ తరగతులు ఉంటాయని, వీటికి తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో ఈజీఎస్ కింద మంజూరైన రూ.12 లక్షల నిధులతో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శుక్రవారం పంచాయతీ కార్యదర్శి మురళీధర్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. నాణ్యతతో భవనాన్ని సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేసరి కిషన్ గౌడ్, మద్దెల సురేందర్ రాజు, లింగంపల్లి ప్రభాకర్, ఎర్రం తిరుపతి, దాగం పార్వతి, జనక్ ప్రసాద్, సంజయ్ జాడి కిషోర్, దుర్గం తిరుపతి, పస్తం రాజు, గ్రామపంచాయతీ కారోబార్ సుధాకర్, అంగన్‌వాడీ టీచర్ మంజుల, ఆయా లత పాల్గొన్నారు.



ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన

- రాష్ట్రస్థాయికి 31 ప్రదర్శనల ఎంపిక
- వైవిధ్యతను చాటిన విద్యార్థులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ అధ్యక్షతన కొనసాగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారం ముగిశాయి. మొత్తం 358 ప్రదర్శనలు విద్యార్థుల చేత ప్రదర్శించగా రాష్ట్రస్థాయికి 31 ప్రదర్శనలను ఎంపిక చేశారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాధికారి యాదయ్య పాల్గొని విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో వైజ్ఞానికతను వెలికి తీయడానికి ప్రదర్శనలు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. జిల్లాలో రెండు రోజులపాటు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించడానికి కృషి చేయడంతో పాటు విద్యార్థులకు వినూత్న ఆలోచనలు కలిగించేలా తోడ్పాటు అందించిన ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు చదువుతోపాటు వినూత్న విషయాలను నేర్పాలన్నారు. అలా చేసినప్పుడే విద్యార్థులకు గుర్తుంటామని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల నుండి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎగ్జిబిషన్ తిలకించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, సెయింట్ మేరీ పాఠశాల ప్రిన్సిపాల్ త్రిష్యమ్మ కాగజ్‌నగర్ ఎంఈఓ వాసాల ప్రభాకర్, డీఈఓ కార్యాలయం ఎఫ్ఏఓ దేవాజీ, ఏసీజీఈ ఉదయబాబు, ఆసిఫాబాద్ ఎంఈఓ సుభాష్, ఏసీఎంఓ ఉద్ధవ్, సమన్వయకర్తలు ధర్మపురి వేంకటేశ్వర్లు, యూఎస్‌చారి, కే.ఊశన్న వ్యవహరించారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు

మొత్తం 358 ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించగా, వీటిలో 108 ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు కాగా, 250 బాల వైజ్ఞానిక ప్రదర్శనలున్నాయి. వీటిలో 10 ఇన్‌స్పైర్ ప్రాజెక్టులను 19 బాల వైజ్ఞానిక ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వీటిలో ఇన్‌స్పైర్ మనక్ కింద మహేష్, కారు నవీన్ (జీపీహెచ్‌ఎస్, కాగజ్‌నగర్), అభినయ కుమార్, దాడి సంజీవ్ (జీపీహెచ్‌ఎస్, సలుగుపెల్లి), సూర్యవంశ సాయిరాం (ఎంజేపీ, కాగజ్‌నగర్), దుర్గం అనిషా (టీఎస్ డబ్ల్యూఆర్ఎస్, సిర్పూర్-టి), శంకరమ్మ (జెడ్పీఎస్ఎస్, తిర్యాణి), సూరజ్ సోలంకి(టీజీఎమ్ఎస్, ఆసిఫాబాద్) ఎంపికయ్యారు.

బాల వైజ్ఞానిక ప్రదర్శనలు

బాల వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా వివిధ పాఠశాలల నుండి 19 మందిని ఎంపిక చేశారు. సీనియర్స్ విభాగంలో అంజలి (కేజీబీవి, పెంచికల్‌పేట), సాయిరాం (జడ్పీఎస్ఎస్, రాస్పెల్లి), సాహితి (కేజీబీవీ, ఆసిఫాబాద్), వెన్నెల (జెడ్పీఎస్ఎస్ గర్ల్స్, ఆసిఫాబాద్), సుల్తాన్ (జెడ్పీహెచ్‌ఎస్, కెరమెరి), శ్రీకాంత్ (జెడ్పీహెచ్‌ఎస్, జనకాపూర్), పౌర్ణమి (కేజీబీవీ, కౌటాల) ఉండగా, అప్పర్ ప్రైమరీ లెవెల్‌లో శృతి (యూపీఎస్, వంజిరిగూడ), శాన్వి (విశ్వశాంతి హై స్కూల్, కాగజ్‌నగర్), సాహిల్ (ఇన్ఫాంట్ జోసెఫ్ స్కూల్), ప్రజ్ఞశ్రీ (కేజీబీవీ-సిర్పూర్-టి), దయాన (టీజీ ఎమ్ఎస్ సిర్పూర్-టి), హారిక (కేజీబీవీ సిర్పూర్ టి), సైఫానాజ్ (జెడ్పీఎస్-ఎస్ ఉర్దూ ఆసిఫాబాద్), ఐటీడీఏ పరిధిలో రామ్ చరణ్ తేజ, ప్రతాప్ (జీపీహెచ్‌ఎస్, కాగజ్‌నగర్), సాయిచరణ్, ప్రశాంత్, శివ (జీపీహెచ్‌ఎస్, సిర్పూర్-టి) నుండి ఎంపికైనట్టు అధికారులు తెలిపారు.



వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని టేకుమట్ల గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. రైతులతో కలిసి మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ స్థానికంగా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు సన్నరకం బియ్యానికి రూ.500 బోనస్ పొందవచ్చునని తెలిపారు. దళారులను ఆశ్రయించి తక్కువ ధరతో ధాన్యం అమ్ముకోకుండా రైతుల అందుబాటులో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని గుర్తు చేశారు.

25 అంశాల ఏజెండా ఆమోదం

నవతెలంగాణ-మందమర్రి



క్యాతనపల్లి మున్సిపాలిటీలో 25 అంశాల ఏజెండాని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జూనియర్ అసిస్టెంట్ సీహెచ్ ప్రదీప్ కుమార్ 25అంశాల ఏజెండాను సభ్యులకి చదివి వివరించి ఏజెండా ప్రవేశపెట్టారు. 25అంశాల ఏజెండాను కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపాల్ కమిషనర్ గద్దె రాజు, వైస్ చైర్మన్ విద్యా సాగర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, డి.స్వామి, మేనేజర్ కె సతీష్, రెవెన్యూ అధికారి అచ్యుత్, ఎంఏఈ రాజ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ కార్యాలయం ఏదీ..?

- పేరు బోర్డు లేని కాసిపేట ఎంపీడీఓ కార్యాలయం



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో ప్రధాన కార్యాలయమైన మండల పరిషత్ కార్యాలయానికి పేరు లేకుండా ఉండడం పట్ల మండల ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఏ కార్యాలయమైనా ముందుగా కార్యాలయం ముందు పేరుతో కూడిన బోర్డు లేదా రాతలతోనే గుర్తించడానికి వీలుగా దర్శనమిస్తుంది. కాని ప్రధాన కార్యాలయానికి కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడంతో కార్యాలయానికి వచ్చే వారు కార్యాలయం ఎక్కడ ఉంటుందోదని అందరిని అడుగుతూ తెలుసుకొని వెళ్లాల్సిన పరిస్థితి. ఇంత పెద్ద కార్యాలయానికి కనీసం బోర్డు ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యం చేయడం పట్ల విమర్శలు వెళ్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కార్యాలయానికి బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చెకుముకి రాష్ట్రస్థాయి పోటీలకు స్లేట్ విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాలలో అత్యుత్తమ ప్రథభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. జన విజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష తెలంగాణ వారి సహకారంతో నవంబర్ 7న పాఠశాల స్థాయిలో నవంబర్ 21న మండల స్థాయిలో జరిగిన చెకుముకి సైన్స్ సంబరాలలో స్లేట్ స్కూల్ విద్యార్థులు ఎర్రం అశ్రీత్, సుదైస, అజ్మీన్, షేక్ జైద్ ప్రథమ స్థానాలను సాధించి నవంబర్ 28న జరిగిన జిల్లా స్థాయి పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు ఎంపికైనట్టు తెలిపారు. వీరు డిసెంబర్ 14 నుంచి16 వరకు ఆదిలాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్యామ్‌లాల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు

నేడు ప్రభుత్వ పాఠశాలల బంద్



నవతెలంగాణ-తాండూర్

తెలంగాణలో జరుగుతున్న వరుస ఫుడ్ పాయిజన్లకు నిరసనగా నేడు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బంద్‌కు పిలుపు నిచ్చినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ తెలిపారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో ఉన్నత అధికారుల పర్యవేక్షణ లేనందువలనే ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఫలితంగా ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో చదువుతున్న విద్యార్థిని చనిపోయిందన్నారు. మంచిర్యాల జిల్లాలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడం వల్ల అస్వస్థకు గురయ్యారని తెలిపారు. రాష్ట్రంలో అనేక చోట్ల ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని ఘటనల దృష్ట్యా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు బందు పాటించి నిరసన తెలిపాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు చరణ్ రెడ్డి, రవి, గణేష్ పాల్గొన్నారు.

తేమశాతం తగ్గించేలా రైతులు దృష్టి పెట్టాలి

నవతెలంగాణ-జన్నారం



వరి ధాన్యంలో తేమ శాతం తగ్గించేలా రైతుల దృష్టి పెట్టాలని జన్నారం క్లస్టర్ ఏఈఓ త్రిసంధ్య సూచించారు. శుక్రవారం మండలంలోని రేండ్లగూడ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ధాన్యంలో 17శాతంలోపు తేమ ఉంటేనే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యాన్ని కోసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రైతులు పాల్గొన్నారు.

వీసీ లైవ్ టెలికాస్ట్‌లో రైతులు పాల్గొనాలి

నవతెలంగాణ-జన్నారం

మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 30న సాయంత్రం 4 గంటలకు రైతు వేదికలో రైతులను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతారని, వీడియో కాన్ఫరెన్స్ లైవ్ టెలికాస్ట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేశామని ఏఓ సంగీత తెలిపారు. రైతులు కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం

- కలెక్టర్ కుమార్ దీపక్
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలి



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణపు పనులు వేగవంతంగా పూర్తి చేసి మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణపు పనులు పరిశీలించారు. నిర్మాణపు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం మండల పరిధి సుంకరిపల్లి, భీమారం, ఆరెపల్లి, మద్దికల్ గ్రామాలను సందర్శించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మద్దతు ధరతో పాటు క్వింటాళుఒకంటికి రూ.500 చొప్పున బోనస సొమ్ము చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం విక్రయించిన రెండు మూడు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు మొత్త జమ చేయనున్నామని వివరించారు. కొనుగోలు కేంద్రాలకు తరలించే ధాన్యం 17 శాతం మించకుండా తేమ కలిగివుండటంతో పాటు తాలు తప్పా లేకుండా నాణ్యమైన ధాన్యం మాత్రమే విక్రయించాలని సూచించారు. కాగా రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ వంట గది, ఆహార నిల్వలు, గదులు, పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం వడ్డించాలని ఆదేశించారు. శుద్ధమైన తాగు నీరు అందించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఆహారం వండుతున్నప్పుడు తాజా కూరగాయలు, నాణ్యమైన ఆహారం ధాన్యం వినియోగించడంతో పాటు వంట చేస్తున్నప్పుడు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆహారం తీసుకునే ముందు విద్యార్థులు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు.

నవంబర్ 29 ఒక చారిత్రక ఘట్టం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్
- అధికార మదంతో వేధించే వారికి తగిన బుద్ధి చెప్తాం
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండండి



నవతెలంగాణ-మంచిర్యాల

చరిత్రలో నవంబర్ 29 ఒక చారిత్రక ఘట్టంగా మిగిలి పోతుందని, చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ తెలంగాణ ప్రజల్లో నిలిచిపోతారని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. శుక్రవారం దీక్ష దివస్ సందర్భంగా నస్పూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటగా కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నవంబర్ 29, 2009న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజన్నారు. రాష్ట్రం కల సాకారానికి పునాది వేసిన రోజుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవే నిర్బంధాలు, అణచివేతలు, అవే దుర్భర పరిస్థితుల నేపథ్యం కనిపిస్తుందన్నారు. ఆనాడు ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన కేసీఆర్ స్ఫూర్తితో నేడు మళ్లీ రెండు జాతీయ పార్టీల మెడలు వంచాల్సిన పరిస్థితి ప్రతి పౌరునిపై ఉందన్నారు. ఒక్క వర్గం కాదు సంపన్న వర్గాల నుంచి అట్టడుగు వర్గాల వరకు కాంగ్రెస్ పాలనలో బాధపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల పక్షాన ఆలోచన లేదని, నిర్బంధం, నియంతృత్వం మీద ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో విధ్వంసం తప్ప వికాసం లేదన్నారు. జిల్లాలో విద్వేష రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అందరూ మరొకసారి ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధం కావాలని, కుమురం భీం, ఐలమ్మ స్ఫూర్తితో ప్రజల కోసం బలమైన గొంతుకగా నిలవాలని కోరారు. ఒకప్పుడు కల్లోలిత ప్రాంతంగా ఉన్న మంచిర్యాల జిల్లాలో పదేండ్లు ప్రశాంతమైన పరిపాలన అందించామని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా పార్టీ శ్రేణులు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి తుల ఉమా, మంచిర్యాల, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య, చెన్నూర్, బెల్లంపల్లి ,మంచిర్యాల నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాలల సింహగర్జన విజయవంతం చేయాలి



నవతెలంగాణ-జైపూర్

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ మాల మహనాడు చేపట్టిన మాలల సింహగర్జన విజయవంతం చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధూకర్ కోరారు. శుక్రవారం ఇందారం గ్రామంలో మాలల సింహగర్జన పోస్టర్లు ఆవిష్కరించిన ఆయన డిసెంబర్ 1న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి మాలలు కుటుంబ సభ్యులతో కలిసి తరలిరావాలని కోరారు. దళితులంతా కలిసి ఉండటం ఇష్టం లేని అగ్రవర్ణాల వారు చేస్తున్న కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా చెల్లదని రాష్ట్రంలో మాలల జనాభ రెండవ స్థానంలో ఉంటుందన్నారు. మాలల జనాభా తక్కువగా ఉన్నట్టు తప్పుడు సమాచారంతో కొందరు ప్రచారం చేస్తున్న తీరును వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. దళితులంతా ఒక్కటిగా ఉంటే బీఆర్ అంబేద్కర్ కాంక్షినట్లుగా రాజ్యాధికారం చేజారిపోతుందని, దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారనే భావనతో కొందరు అగ్రవర్ణాల వారు దళితులను విడగొట్టాడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మాలల జనాభ తక్కువని జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొడుతూ చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి రాష్ట్రంలో మాలల జనాభ రెండవ స్థానంలో 30 లక్షల మంది ఉన్నారని తెలుపుట కోసం డిసెంబర్ 1న మాలల సింహగర్జన కార్యక్రమం ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రంలో గల మాలలందరిని ఏకం చేయడం కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో లక్షలాదిగా స్వచ్ఛందంగా తరలివచ్చి మాలల సత్తా చూపాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు సంబోదు మధూకర్, పొట్ట అంకయ్య, బడుగు రవి, కొండ సమ్మయ్య పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోని ప్రభుత్వం

నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోవడంలేదని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసండ్ల శ్రీశైలం అన్నారు. శుక్రవారం ప్రెస్ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు వ్యతిరేకంగా పని చేసిన వ్యక్తులకు మంత్రి పదవులు ఇచ్చారన్నారు. కానీ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి నిర్వహించడలేదని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోకుంటే స్థానిక సంస్థలలో తమ సత్తా చాటుతామన్నారు. గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎత్తి చూపుతామన్నారు. అలాగే వచ్చే ఫిబ్రవరి మొదటి తేదీ నుండి 15 వరకు ముక్తాల్ నుండి ఉస్మానియా యూనివర్సిటీ వరకు పాదయాత్ర చేపడతామన్నారు. బిఆర్ఎస్ సైతం దీక్ష దివస్ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదని ఆరోపించారు. ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జిగా ఉపాలిని నియమించామన్నారు. ఈ సమావేశంలో నాయకులు నేతావత్ రాందాస్, బానోత్ రామారావు, దేవిదాస్, ఫయాజ్, మారుతీ పాల్గొన్నారు.

దీక్షా దివస్‌కు తరలిన నాయకులు

నవతెలంగాణ-జన్నారం

నిర్మల్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన దీక్ష దివస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు నిర్మల్ పట్టణానికి వెళ్లారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు రాజారాం రెడ్డి, సూలువ జనార్దన్, రాష్ట్ర నాయకులు కమ్మల విజయ ధర్మ, జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్ కుమార్, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మండల యూత్ అధ్యక్షులు పేరం శ్రీనివాస్, భరత్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేష్ తరలివెళ్లారు.



హెడ్ క్వార్టర్‌ను తనిఖీ చేసిన ఏడీసీపీ



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన సాయుధ ధళ పోలీసుల సమీకరణ కవాతు కార్యక్రమానికి అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సి.రాజు ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వదనం స్వీకరించారు. ఆర్మ్డ్ రిజర్వ్ సాయుధ దళాలు డ్రిల్, ఫుట్ డ్రిల్, సెర్మోనల్ డ్రిల్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది ప్రదర్శించిన పరేడ్ పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. సిబ్బంది సమస్యలను త్వరలో పరిష్కారించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుందర్ రావు, ఆర్ఐ వామనుమూర్తి, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

అటవీ కార్మికుల సంక్షేమం కోసం చర్యలు



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) పనుల్లో పాల్గొంటున్న వలస కార్మికుల సంక్షేమ కోసం శాఖ పరంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్ అన్నారు. మంచిర్యాల డివిజన్ పరిధి కోటపల్లి అటవీ ప్రాంతం నీలగిరి పాంటేషన్ పనుల్లో పని చేస్తున్న వలస కార్మికులకు శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖతో పాటు టీజీఎఫ్‌డీసీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వైద్య శిభిరం ద్వార పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోటపల్లి మండల వైద్యాధికారి అరుణ శ్రీ మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిభిరాలు వలస కార్మికులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఆరోగ్యంగా ఉండటం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించిన ఆమె కార్మికులకు వైద్య పరిక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సంగయ్య, పీహెచ్ మేరీ, అంజలీ, విజయ నిర్మల, సుధాకర్, తిరుతమ్మ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపీసీ ఫస్టియర్ విద్యార్థి మార్నేని మనికంఠ 68వ ఎస్ఏఫ్ అండర్-19 రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ టోర్నమెంట్‌లో ఆదిలాబాద్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనభరిచనట్టు ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. ఈ మేరకు విజయం సాధించి మణికంఠ జాతీయ సాఫ్ట్ బాల్ జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. మనికంఠను ఈ విశిష్ట విజయంపై ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

నేడు గోదావరి నదికి మహా హారతి



నవతెలంగాణ-జైపూర్

కార్తిక మాసాన్ని పురస్కరించుకొని శనివారం వేలాల శివారు గోదావరి నదికి మహా హారతి కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఉత్సవ సమితి మండల కన్వీనర్ డేగ నగేష్ పటేల్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గల పుణ్యక్షేత్రాల్లో ఒకటైన వేలాల మల్లికార్జున స్వామి కొలువై ఉన్న వేలాల శివారు గోదావరి నదికి మహా హారతి ఇవ్వడం జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ఈకార్యక్రమానికి భక్తులు, మహిళలు మంగళహారతులతో భారీగా తరలిరావాలని కోరారు. మల్లికార్జున స్వామి ఆలయం నుండి సాయంత్రం ఐదు గంటలకు భక్తులంతా కలిసి గోదావరి నది తీరానికి చేరుకుంటారన్నారు.

ఘనంగా మైసమ్మ దేవాలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట 1 ఇంక్లైన్ గనిపై శుక్రవారం మైసమ్మ దేవాలయం 23వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్మికులు, అధికారులు వారి కుటుంబ సభ్యులు, గని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో జీఎం దేవేందర్, గని మేనేజర్ భూ శంకరయ్య, కార్మిక సంఘాల నాయకులు దాగం మల్లేశ్, వోడ్నాల రాజన్న బన్న లక్ష్మణ్ దాస్, కనుకుల తిరుపతి, గని అధికారులు పాల్గొన్నారు.



గురుకులాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గురుకులాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం పట్ల నాణ్యత ప్రమాణాలు పాటించాలని తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు పరిశీలించి పలు సూచనలు సలహాలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వంటగది ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జూలూరి యాదగిరి, వైస్ ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీం, రాజన్న, చంద్రశేఖర్, రాజేంద్ర ప్రసాద్, రాజకుమార్, కోసరి మహేష్ పాల్గొన్నారు.

పులుల కదలికలపై గ్రామస్తులకు అవగాహన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని కమ్మర్గాం గ్రామంలో పత్తి చేనుల వద్ద వెళ్లిన కూలీలకు పులి కదలికలపై అటవీ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ చేనుల వద్ద ఒంటరిగా వెళ్లకూడదని, గుంపులుగా వెళ్లాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో పులులకు కోసం డప్పు చాటింపు వేయించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. పులి కనిపిస్తు తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారించాలి



నవతెలంగాణ-కౌటాల

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. శుక్రవారం మండల విద్యావనరుల కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ధర్నా రెండవ రోజులో భాగంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.పది వేల వేతనం అమలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వొద్దని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి కొట్రంగి శారద, నాయకులు, లక్ష్మీ వనిత, విమల, చిన్నక్క పాల్గొన్నారు.

రైతు పండుగను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-బెజ్జూర్

మహబూబ్‌నగర్‌లో శనివారం నిర్వహించే రైతు పండుగను విజయవంతం చేయాలని పీఏసీఎస్ చైర్మన్ కె.ఓంప్రకాష్, కార్యదర్శి సత్యనారాయణగౌడ్ తెలిపారు. శుక్రవారం పిఏసిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పిఏసిఎస్ పరిధిలో ఇప్పటి వరకు 1058 రైతులకు రూ.6.38కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. అలాగే దేశంలో రాష్ట్రం వరిధాన్యం కొనుగోళ్లలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. నేడు జరిగే రైతు పండుగకు తరలివెళ్లి విజయవంతం చేయాలన్నారు.

లక్సెట్టిపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.శ్రీకాంత్ తెలిపారు. శనివారం సాయంత్రం 4గంటల నుండి లక్సెట్టిపేట రైతువేదికలో మహబూబ్‌గర్‌లో జరగబోయే రైతు పండుగ కార్యక్రమం టెలీకాస్ట్ ఉంటుందన్నారు. మండల రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అటవీ జంతువుల నుండి రక్షించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో కొద్దిరోజులుగా అటవీ జంతువుల దాడులతో ప్రజల ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రాణాలు రక్షించే ప్రయత్నాలు చేపట్టాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాజాగా నజ్రుల్ నగర్‌లో పెద్ద పులి దాడిలో మహిళ మరణించడం బాధాకరమన్నారు. గతంలో కూడా జిల్లాలో పులి, ఏనుగు దాడుల్లో మనుషులు చనిపోయారన్నారు. అటవీ అధికారులు జంతువుల బారి నుండి మనషులను రక్షించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లక్ష్మీ కుటుంబానికి పరిహారంతో పాటు ఉద్యోగం ఇవ్వాలని, ఆ కుటుంబానికి అండగా ఉండి పోరాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం, జిల్లా సహాయ కార్యదర్శి రాజ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు దుర్గం నిఖిల్, తిరుపతి పాల్గొన్నారు.

పెద్ద పులి దాడికి ఇంకా ఎంత మంది ప్రాణాలు పోవాలి

నవతెలంగాణ-దహెగాం

జిల్లా ఫారెస్ట్ అధికారులు ఉన్నతాధికారుల మెప్పు పొందడం కోసం పెద్దపులులను పట్టుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్, మండల ఉపాధ్యక్షుడు దిగిడ బక్కన్న, మండల కార్యదర్శి నల్లి దామోదర్ ఆరోపించారు. ఇప్పటికే జిల్లాలో పులి దాడిలో ముగ్గురు మరణించిన విషయం అందరికి తెలుసేనని, అదేవిధంగా ఏనుగు దాడిలో ఇద్దరు మరణించారని గుర్తుచేశారు. అయిన ఫారెస్ట్ అధికారుల నుంచి ఎటువంటి చలనం లేకపోవడం బాధాకరమని, జంతువుల ప్రాణాలకు ఇస్తున్న విలువ మనుషుల ప్రాణాలకు ఇవ్వడం లేదన్నారు. ఈ ప్రాంతంలో తిరుగుతున్న పెద్దపులిని వెంటనే బంధించి తడోబా పులుల సంరక్షణ ప్రాంతానికి తరలించాల్సించాలని కోరారు. పెద్దపులి దాడిలో మరణించిన మొర్లె లక్ష్మీ కుటుంబానికి న్యాయం చేయాలని, మహారాష్ట్ర తరహాలో రూ.15 లక్షల ఎక్స్ గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇల్లు, 5 ఎకరాల సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందజేత

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కేతిని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఎస్సై ఇస్లావత్ నరేష్ వాలీబాల్ కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విజయోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లా అధికారులతో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న ప్రజాపాలన విజయోత్సవాలను డిసెంబర్ 1 నుండి 9వ తేదీ వరకు ఘనంగా నిర్వహించాలన్నారు. డిసెంబరు 1న విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేయాలని, సీఎం కప్ ఆటల పోటీల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2న జిల్లాలో ట్రాన్స్ జెండర్స్‌కు క్లినిక్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని, 3న మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాలను విద్యుత్ దీపకాంతులతో అలంకరించాలని, వైద్య పరీక్షలు, కంటి పరీక్షల శిబిరాలు నిర్వహించాలని, పారిశుధ్య కార్మికులకు రక్షణ కిట్లు, పీపీఈ కిట్లు పంపిణీ చేయాలని, మున్సిపల్ పరిధిలో సంవత్సరంలో చేపట్టిన పనుల జాబితా ప్రదర్శించాలన్నారు. 4న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో జిల్లాలో గ్రూప్-4 ద్వారా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. 5న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కేంద్రాల వద్ద, 6న జిల్లాలో గృహజ్యోతి ద్వారా జీరో కరెంటు బిల్లులపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 7న మున్సిపాలిటీ, గ్రామపంచాయతీలలో ప్రజా పాలన విజయోత్సవాలపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, 8న వివిధ శాఖల ద్వారా కార్యక్రమాలు నిర్వహించాలని, 9న హైదరాబాద్‌లో జరిగే ప్రజా బహిరంగ సభలో జిల్లా నుండి 2 వేల మందిని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి కార్యాలయంలో సంవత్సరం పూర్తయిన సందర్భంగా లోగోలు ఉంచాలని, సంవత్సరంలో సాధించిన లక్ష్యాలు, చేపట్టిన పనుల నివేదికలను శనివారంలోగా శాఖల వారీగా ముఖ్య ప్రణాళిక అధికారికి అందించాలని తెలిపారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

- మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు
- జిల్లా కేంద్రంలో దీక్ష దివస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర అభివృద్ధి తమ పార్టీతోనే సాధ్యమని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు పునరుద్ఘాటించారు. తెలంగాణ రావడానికి కేసీఆర్ దీక్ష ప్రారంభించిన రోజున పురస్కరించుకొని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్ష దివస్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అమరవీరుల స్థూపానికి నివాళులర్పించినంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, జిల్లా బీఆర్ఎస్ భవన్‌కు చేరుకుని కేసీఆర్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన సంవత్సర కాలంలో రాష్ట్రాన్ని అభివృద్ధిలో తిరోగమనంలో నడిపిస్తున్నారని ఆరోపించారు. సంపూర్ణ తెలంగాణ కోసం తాము నిరంతరం కృషి చేస్తామని అదే తమ లక్ష్యమన్నారు. దీనికోసం కార్యకర్తలు మరోసారి పోరాటానికి సిద్ధం కావాలన్నారు. సంవత్సర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీకొట్టే పరిస్థితి దాపురించిందన్నారు. కాంగ్రెస్ చేసే ప్రతి తప్పు తమకు పని చేస్తుందన్నారు. తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్ర ఎంతో గొప్పదన్నారు. 2009 నవంబర్ 29న తెలంగాణ వచ్చుడో కేసీఆర్ చచ్చుడో అనే నినాదంతో దీక్షకు పూనుకున్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఐదు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను ఢిల్లీలో ఉన్న నేతలకు తెలియజేయడంలో ప్రముఖ పాత్ర పోషించాడని, ఈ దీక్షతోనే తెలంగాణ కల సాకారం అయిందన్నారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన 6 గ్యారంటీల అమలులో విఫలమైన పరిస్థితిని ప్రజలకు వివరించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ గెలవడం ఖాయమన్నారు. ఇప్పటినుండి నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. అనంతరం మహిళా కార్యకర్తలతో కలిసి బతుకమ్మ పాటలకు నృత్యాలు చేశారు. తెరపై కేసీఆర్ 10 సంవత్సరాల్లో ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మర్సుకోల సరస్వతి, కలాం, వెంకన్న, సలీం, అలీబిన్ హైమద్, కనక యాదవరావు, జగదీష్, శ్రీనివాసరావు, రవి, శ్రీనివాస్, అన్వార్, సాజిద్, అజయ్ కుమార్, నిసార్, హైమద్, సౌందర్య, కుందారపు శంకరమ్మ, దూర్వదాబాయి, సంగీత, ఉమా, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్ : సివిల్ జడ్జి

నవతెలంగాణ-బోథ్



డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి మౌనిక అన్నారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, పోలీసు, బ్యాంకు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశమున్న క్రిమినల్, సివిల్, బ్యాంకు కేసులను తప్పకుండా ఎక్కువ మొత్తంలో పరిష్కారం అయ్యేటట్లు చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిపి శ్రీధర్, ఏజీపి పంద్రం శంకర్, న్యాయవాదులు సుభాష్, రూపేందర్ సింగ్, హరీష్, దమ్మాపాల్, విజయ్ కుమార్, జమీర్, రాజు, బోథ్ ఇచ్చోడ, బజార్‌హత్నూర పోలీసు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రదర్శనలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారం ముగిసింది. ఇందులో మొత్తం 358 ప్రదర్శనలు వచ్చాయి. కాగా వీటిలోంచి రాష్ట్రస్థాయికి 31 ప్రదర్శనలను ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు వారు తయారు చేసిన ప్రదర్శనాలు, ఉపాధ్యాయుల సహకారం గురించి చెప్పారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో జడ్పిహెచ్ ఎస్ విద్యార్థుల ప్రతిభ

కెరమెరి : జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కెరమెరి జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ విభాగంలో షేక్ సుల్తాన్ హైమద్ మొదటి బహుమతి సాధించాడు. జూనియర్ విభాగంలో సాయినాథ్ మొదటి బహుమతి సాధించగా, సీనియర్ విభాగంలో మూడవ బహుమతిని దీపక్ నాయక్ సాధించారు. వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ సాధించిన ముగ్గురు విద్యార్థులకు జిల్లా విద్యాధికారులతో పాటు మండల విద్యాధికారి ఆడే ప్రకాష్ బహుమతులు అందజేసి అభినందించారు. భవిష్యత్తులో ఇంకా మంచి ప్రదర్శనాలు తయారు చేసిన భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు సహకారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గైడ్ సహకారంతో సాధించాము

సాహితి, కేజీబీవీ విద్యార్థిని



తన గైడ్ ఉపాధ్యాయురాలు స్వప్న సహకారంతో రాష్ట్రస్థాయికి తనతో పాటు మానస అమృతలు తయారుచేసిన ప్రకృతి సిద్ధమైన వ్యవసాయం ఎంపికైంది. ఎటువంటి మందులు లేకుండా ప్రకృతి సిద్ధంగా దొరికే ఎరువులతో అతి ఎక్కువ పంటలు పండే విధానాన్ని తెలియజేశాం.

గురుత్వాకర్షణ దిశ క్లైనోమీటర్ తో తెలుస్తుంది

శ్రీకాంత్, జడ్పీఎస్ఎస్ జనకాపూర్



క్లైనో మీటర్‌తో గురుత్వాకర్షణ దిశ తెలుస్తోంది. ఒక వస్తువు యొక్క ఎత్తు లేదా మాంద్యం యొక్క కోణాలను కొలవడానికి ఇది ఉపయోగపడుతుంది దీని గురించి మా ఉపాధ్యాయుని ద్వారా తెలుసుకోగానే దీన్ని తయారు చేయాలని కోరిక కలిగింది. దీనికి మా ఉపాధ్యాయుడు రాజేష్ తోడ్పాటు అందించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

ఆర్టీసీ డిపోలో కార్తీక వనభోజనాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కార్తీక మాసం శుక్రవారం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో కార్మికులతో నిర్వహించిన వనభోజనాలకు ఆర్టీసీ ఆర్ఎం సాలోమాన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో తీరిక లేకుండా ఉన్న ఆర్టీసీ కార్మికులకు ఇటువంటి కార్యక్రమాలు కొంత చేయూత ఇస్తాయన్నారు. కార్మికులు కుటుంబ సభ్యులతో పాల్గొని సేద తీరాలన్నారు. డిపో మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ శుక్ర, శనివారాలు రెండు రోజులు వనభోజనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. వనభోజనాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్, ప్రవీణ్, అకౌంట్స్ ఆఫీసర్, శంకరయ్య, డిప్యూటీ ఈఈ ఆంజనేయులు ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

ముగిసిన నెట్ బాల్ జోనల్ స్థాయి పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా సెక్రెటరీ వెంకటేశం అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అండర్ 14 నెట్ బాల్ జోనల్ స్థాయి పోటీలు శుక్రవారం నిర్వహించారు. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన నెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలిబిన్ అహ్మద్, పాఠశాల ప్రిన్సిపాల్ మహేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుండి 150 మంది పాల్గొన్నారని వీరిలో 12 మంది చొప్పున బాలబాలికలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. జోనల్ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు వచ్చేనెల 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో పీడీలు హరీష్, హరికృష్ణ, సీహెచ్.ఏడుకొండలు, తిరుపతి, సౌందర్య, అంకిల, శోభారాణి, రాధా, రాణి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని వాంకిడి ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారంతో మరణించిన శైలజ మృతికి నిరసనగా హైదరాబాద్‌లో బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్లనున్న బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శైలజ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని హెచ్చరించారు. అరెస్టు చేసిన వారిలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్‌తో పాటు పలువురు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిసెంబర్ 1న మంచిర్యాలలో జరిగే 10వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. కాగా ప్రిన్సిపాల్ సిస్టర్ లిబిన్, కరస్పాండెంట్ అనిమాథ్యూ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల క్రీడాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాష్ట్రస్థాయిలో విద్యార్థులు ప్రతిభ కనబడుచాలన్నారు. కార్యక్రమంలో పీఈటీలు కడతల రాకేష్, హోమకంటి కిరణ్, అర్చనకుమారి, ఆత్రం బద్రి, విద్యార్థులు కట్కుర్ నేహాల్, ఆడే వివాన్, ఆశిష్ పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఏర్పాటు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర వికలాంగుల హక్కుల నియమావళి-2018, వికలాంగుల హక్కుల చట్టం-2016 అనుసరించి వికలాంగుల జిల్లా కమిటీ ఏర్పాటు కొరకు అర్హులైన వికలాంగుల నుండి దరఖాస్తుల స్వీకరించడానికి గడువును డిసెంబర్ 14 వరకు పెంచినట్లు వికలాంగుల జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తులు సమర్పించాల్సి ఉన్నప్పటికీ ప్రజాపాలన దినోత్సవాలను పురస్కరించుకొని డిసెంబర్ 14 సాయంత్రం 5 గంటలలోగా సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను పరిశీలించి అర్హత గల దివ్యాంగులను జిల్లా కమిటీకి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | నవంబర్ 30, 2024 | www.navatelangana.com

రైతు పండుగకు తరలిరావాలి

నవతెలంగాణ-కుభీర్



మండల కేంద్రం పీఏసీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మెన్ రేకుల గంగా చరణ్, కార్యదర్శి క్రాంతి కుమార్ మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. అదే రైతు రుణమాఫీ, రైతుబీమా, రైతు భరోసా, పంట బీమా, ఉచిత కరెంట్, సన్న రకానికి బోనస్ తదితర పథకాలు ప్రవేశపెట్టి రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం రైతు మహాజన సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సిబ్బంది గణేష్, శివరాం, వెంకట రమణ, రైతులు పాల్గొన్నారు.

రైతు క్షేమమే దేశ క్షేమం

నవతెలంగాణ-కడెం



రైతు క్షేమమే దేశ క్షేమమని, అన్నదాతల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కృషి చేయాలని తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రిటైడ్ జస్టిస్ చంద్రకుమార్ కోరారు. శుక్రవారం మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించి, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతుల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక కృషి చేసేంతవరకు తాము రైతుల సమస్యల పట్ల పోరాడుతామన్నారు. డిసెంబర్ ఒకటో తేదీన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఐదో వార్షికోత్సవ సదస్సులో భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులు, బీసీ సంక్షేమ వసతి గృహ, మహాత్మ జ్యోతిబాపూలే వసతి గృహ ప్రిన్సిపాల్స్, హెడ్ కుక్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే ప్రతి విద్యార్థికి మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. మండలాల వారిగా వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య, వారికి అందిస్తున్న భోజన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంటకు నాణ్యమైన కూరగాయలు, సరుకులు మాత్రమే వినియోగించాలన్నారు. కూరగాయల సరఫరాదారులు వసతిగృహాలకు నాణ్యమైన కూరగాయలు, చికెన్, మటన్, కోడిగుడ్లు, అరటి పండ్లు, పాలు ఇతర సరుకులను సరఫరా చేయాలన్నారు. సరఫరదారులు అందించిన వస్తువుల నాణ్యతను ప్రిన్సిపాల్స్ పరిశీలించి, వస్తువుల నాణ్యత సరిగా లేనట్లయితే వాటిని తిరిగి వెనక్కి పంపించాలని తెలిపారు. కుళ్లిన, నిల్వ ఉంచిన కూరగాయలు, చికెన్, మటన్, కోడిగుడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వంటకు ఉపయోగించరాదన్నారు. అన్ని సరుకులను పరిశుభ్రంగా, ఎప్పటికప్పుడు సరఫరా చేయాలని తెలిపారు. కూరగాయలను నేరుగా నేలమీద ఉంచకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వంటకు ముందు కూరగాయలను ఉప్పు నీటితో కడగాలని సూచించారు. పుచ్చులు, పురుగులు ఉన్న కూర గాయలను వంటకు ఉపయోగించరాదన్నారు. వంటగది, స్టోర్ రూమ్, డైనింగ్ హాలును ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలన్నారు. వంట గదిలో దోమలు, ఈగలు, పురుగులు, బొద్దింకలు, బల్లులు, ఇతర కీటకాలు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వంట మనుషులు ఇప్పటికప్పుడు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, వంటకు ముందు చేతులు, కాళ్లను పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. వంట చేసే సమయంలో తప్పనిసరిగా హెడ్ క్యాప్, మాస్క్, ఆప్రాన్ ధరించాలన్నారు. వంట పాత్రలను డిష్ వాషర్లతో ఒకటికి రెండుసార్లు శుభ్రపరచాలన్నారు. వసతిగృహాల్లోని నీటి తొట్టెలను వెంట వెంటనే శుభ్రపరచాలని తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని మాత్రమే అందించాలన్నారు. బియ్యం, పప్పు దినుసులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. వంట సరుకులు వసతి గృహానికి రాగానే వస్తువుల గడువు తేదీ ప్రత్యేక రిజిస్టర్లలో నమోదు చేసి ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు తీరిన వస్తువులను వంటకు ఉపయోగించరాదని తెలిపారు. మరుగుదొడ్లను, వసతి గృహ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ,

పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిలను పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి డి.శ్రీనివాస్, సహాయ బీసీ సంక్షేమ అధికారి సత్యనారాయణరెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్త గోపీచంద్, బీసీ సంక్షేమ గృహ, మహాత్మ జ్యోతిబాపూలే సంక్షేమ వసతి గృహాల ప్రిన్సిపాల్స్, వంట మనుషులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల్‌లో ఏసీబీ దాడులు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సర్వే ల్యాండ్ రికార్డ్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. కార్యాలయంలో పనిచేస్తున్న జగదీష్ జూనియర్ అసిస్టెంట్ నిర్మల్ జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ కాలనీకి చెందిన సల్ల హరీష్ కుమార్ నుండి తన పట్టా భూమి చేత్వారీ కోసం రూ.20వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం మధ్యాహ్నం కార్యాలయంలో భార్య జోష్ణ స్థానంలో అటెండర్‌గా పనిచేస్తున్న ప్రశాంత్‌కు రూ.10 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధ శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. వారి వద్ద నుంచి డబ్బులు స్వాధీనం చేసుకుని కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చలి తీవ్రత పెరుగుతుండటంతో తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని నిరుపేదలకు బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కమిటి వ్యవస్థపకులు బండ అనిల్ కుమార్, ఇచ్చోడ మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, భూషణ్, మాజీ ఎంపీటీసీ విజయ్, జడ్పీటీసీ, కమిటి సభ్యులు కుర్ర నరేష్, అనుముల ఉదయ్, సామల రవి, కుర్ర రవీందర్, బండ సునీల్, రాజుయాదవ్, మదాస్తు శంకరన్న, చంద్రశేఖర్ రెడ్డి, బండ అర్జున్, జగన్, ట్రస్ట్ మెంబెర్స్ పాల్గొన్నారు.

న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి జిల్లాలోని యువతీ, యువకులు తెలంగాణ ప్రభుత్వం నేషనల్ అకాడమీ కన్స్‌స్ట్రక్షన్ ఆఫ్ గవర్నమెంట్ తెలంగాణ సినిమా టెక్నాలజీ అండ్ స్టాఫ్ వేర్ కోర్స్‌కు సంబంధించి నోటిఫికేషన్ విడదల చేసిందని అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా సినిమాటోగ్రఫీ మాస్టారి, డిజిటల్ డిజైన్ అండ్ సోషల్ మీడియా మేనేజ్మెంట్, ప్రొడక్షన్ మేనేజ్మెంట్, యాంకరింగ్, డబ్బింగ్, వాయిస్ ఓవర్ స్కిల్స్, మ్యూజిక్ ప్రొడక్షన్ మాస్ట్రీ ప్రొఫెషనల్ ప్రొడక్షన్ మాస్టారి, ప్రొఫెషనల్ గానం శిక్షణ డిజైనింగ్ నైపుణ్యం మొదలగు కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 3 నెలల కోర్సు కు సంబంధించి మూడు విడతలుగా రూ.35 వేలు ఫీజు నిర్ణయించిందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తూ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌లో సభ్యత్వం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు డిసెంబర్ 2లోగా న్యాక్ కార్యాలయంలో ఇన్‌చార్జీ ఎం.మహేష్ కుమార్ 9154548063 ని సంప్రదించాలని సూచించారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వే పక్కాగా నిర్వహించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేందర్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

డిసెంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వే పక్కాగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేకు సంబంధించి మెడికల్ ఆఫీసర్లు, నోడల్ సూపర్‌వైజర్లతో ఓరియంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో గుర్తించిన వారికి మందులు అందించి, వ్యాధి నివారణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీపీఎంఓలు రాజేశ్వర్, గంగన్న, వైద్యులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని శంకర్ నాయక్ తండా గ్రామంలో సప్తాహ కార్యక్రమానికి హజరై మాట్లాడారు. ఆధ్యాత్మికతతో మనసు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుందని అన్నారు. దేవుడి నామాస్మరణం చేయడం వల్ల జీవితంలో ఎంతో మేలు చేకురుతుందన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం లక్షెట్టిపేట ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. భోజనంలో నాణ్యతను పాటించాలని సంబంధిత అధికారులను సూచించారు. తొలి ఆదివాసీ ఐఏఎస్ అధికారి మడావి తుకారాం 26వ వర్ధంతిలో పాల్గొన్నారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత తొలి ఆదివాసీ ఐఏఎస్ మడావి తుకారాం అడుగుజాడల్లో నడువాలని కోరారు. అనంతరం దంతన్‌పల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు పండుగను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-బోథ్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పథకాలు ప్రజా విజయోత్సవాలలో భాగంగా రైతు పండుగను విజయవంతం చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తు, ధాన్యం కొనుగోలుకు బోనస్, వరదల వల్ల నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి పది వేల రూపాయలు, రైతు రుణమాఫీ, నూతన మార్గదర్శకాలతో రైతు భరోసా పథకాన్ని అమలు చేయడానికి పూనుకుందన్నారు. అందులో భాగంగానే పెండింగ్ లో ఉన్న మరో మూడు లక్షల మంది రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ అమలు చేస్తున్న సందర్భంలో అన్ని గ్రామాలలో మూడు రోజులపాటు రైతు పండుగ నిర్వహించాలని కోరారు. నాణ్యమైన విత్తనాలు దిగుబడులను సాధించి దేశానికే తలమానికంగా తెలంగాణ రైతు సంఘం నిలబడే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, భోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ విఠల్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాస రచన పోటీలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా మండలస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలను పునరుత్పాదక, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు అనే అంశంపై ఈ నెల 30న సోఫీనగర్ గురుకుల పాఠశాలలో మధ్యాహ్నం 2గంటలకు నిర్వహిస్తున్నామని డీఈఓ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు, వచ్చే నెల 3న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థులు దేశభక్తి నైతిక విలువలు కలిగిఉండాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తి, నైతిక విలువలు కలిగిఉండాలని ఎంఈఓ పరమేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కడ్తాల్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థిలో సృజనాత్మక కళలు దాగి ఉంటాయని అన్నారు. వాటిని వెలికి తీసే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. అనంతరం విద్యార్థుల నాటకాలు, నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.

రాష్ట్రస్థాయి పోటీల్లో దివ్యాంగ క్రీడాకారుల ప్రతిభ



నవతెలంగాణ-నిర్మల్ టౌన్

ఈనెల 27, 28తేదీల్లో హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి గచ్చిబౌలీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడాకారుల ఆటల పోటీలలో జిల్లా దివ్యాంగులు ప్రతిభ కనబరిచినట్టు జిల్లా సంక్షేమాధికారి ఫైజాన్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ స్థానంలో మూడు విభాగాలలో, ద్వితీయ స్థానంలో రెండు విభాగాలలో గెలుపొందినట్లు తెలిపారు. వీరికి వికలాంగుల డైరెక్టర్ చేతుల మీదుగ బహుమతుల ప్రదానం చేయడం జరిగిందన్నారు. ముకేష్ షాట్‌పుట్ మొదటి బహుమతి, పి.దేవుబాయి చేస్‌లో మొదటి బహుమతి, జి.రాకేష్ ట్రై సైకిల్‌లో మొదటి బహుమతి, పి.ఆనంద్‌రావ్ చేస్‌లో రెండవ బహుమతి, ఏ శ్రీవల్లి ట్రై సైకిల్‌లో రెండో బహుమతి పొందినట్టు తెలిపారు.

ఉద్యోగోన్నతి పొందిన ఎస్సైకి సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండలం మచ్చపూర్ కొలాంగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంరావ్ ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల ఎస్సైగా ఉద్యోగోన్నతి పొందారు. దీంతో శుక్రవారం ఆదివాసీ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో ఘనంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటేల్, ఆదివాసీ సేన జిల్లా సలహాదారులు ఉయిక లక్ష్మణ్, ఆదివాసీ విద్యార్థి సేన జిల్లా కన్వీనర్ కుంరం చత్రుఘన్, ఆదివాసీ సేన మండలాధ్యక్షులు సేడ్మకి భీంరావ్ ఆదివాసీ సేన నాయకులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలల బంద్‌కు పిలుపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రాష్ట్రవ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలల్లో, కేజీబీవీల్లో, గురుకులాల్లో, సంక్షేమ హాస్టల్‌లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్టు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో వామపక్షా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించాలని పిలుపునిస్తున్నట్టు తెలిపారు. ఈ బంద్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రభుత్వ పాఠశాల అధికారులు, సహకరించాలని, వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ నుంచి కోరుతున్నట్టు పేర్కొన్నారు. ఇలాంటి ఫుడ్ పాయిజన్ ఘటనలు మరల పునరావృతమైతే వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన దిగుతామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కోకన్వీనర్ కొట్నాక్ సక్కు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గెడం కేశవ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సాయి, అశోక్, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి, దత్తాత్రి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సాయి పాల్గొన్నారు.

ముగిసిన అఖండ హరినామ సప్తాహ

నార్నూర్ : మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో జ్ఞానేశ్వర్ మౌళి సంజీవన సమాధి సందర్భంగా విఠల్ రుక్మాయి ఆలయంలో నిర్వహించిన అఖండ హరినామ సప్తహ శుక్రవారంతో ముగిసింది. ఆలయ కమిటీ సభ్యులు ఏడు రోజుల పాటుగా భజన కీర్తనల నడుమ ఘనంగా నిర్వహించారు. దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు.ఈ అఖండ హరినామ సప్తహ కార్యక్రమం 57 సంవత్సరాల నుంచి గ్రామ ప్రజల సహకారంతో ప్రతియేటా కార్తీక మాసంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చివరి రోజు సప్తహ ముగింపు సందర్భంగా కాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు విష్ణు ఫడ్, రాము పటేల్, రాంకిషన్, ఆలయ కమిటీ సభ్యులు కోటగిరి విశాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గణిత ప్రతిభ పరీక్షలో లింగాపూర్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-కడెం

శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నిర్వహించే గణిత ప్రతిభపాఠవ పరీక్షలో మండల స్థాయిలో మరోసారి జెడ్పీఎస్-ఎస్ లింగాపూర్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. శుక్రవారం మండల స్థాయిలో నిర్వహించిన ప్రతిభపాఠవ పరీక్షలో ఆంగ్ల మాధ్యమంలో ప్రథమ స్థానంలో అబ్దుల్ జుల్ఫీ, ద్వితీయ స్థానం నివేదిత, తెలుగు మాధ్యమంలో ప్రథమ స్థానం సతీష్, ద్వితీయ స్థానంలో రాజు నిలిచారని త్వరలో జరగబోయే జిల్లాస్థాయి పోటీలకు వీరు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ తెలిపారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం వారిని అభినందించారు.

నిర్మల్‌రూరల్ : ప్రముఖ గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సోన్ మండలంలో గణిత ఫోరం ఆధ్వర్యంలో గణిత ప్రతిభ పరీక్షను నిర్వహించారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసి, జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్టు ఫోరం సభ్యులు రమణేశ్వర్ తెలిపారు.

ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అంజన రాము

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక అంజన ఫొటోస్టూడియోలో శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దశర్ల శ్రీశైలం, జిల్లా అధ్యక్షుడు సామర్ల ప్రశాంత్, చేతుల మీదుగా బోథ్ పట్టణానికి చెందిన అంజన రాముకు తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టినందుకు సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలోని కార్మికులకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ విద్యా సంస్థల బంద్‌కు పిలుపు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రభుత్వ విద్యా సంస్థలలో ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు వెంకటేష్ అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణం కస్తూర్బా ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఘటనలపై నిరసిస్తూ నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కైలాస్, మహేష్, వెంకటేష్, దిగంబర్, రాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.